క్లుప్తంగా

ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా సారంగపాణి



వేలేరు: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామానికి చెందిన శ్రీపతి సారంగపాణిని నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నేరవేర్చేవిధంగా ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బాషబోయిన రవీందర్‌యాదవ్, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

దామేశ్వరాలయ అభివృద్ధికి సహకరించాలి

దామెర: దామేశ్వరాలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న (ఆదివారం) దామెర శివాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. దామేశ్వరాలయాన్ని అధ్యాత్మిక కేంద్రంగా ఏర్పాటు చేయడంతో పాటు ఆలయానికి ఆనుకొని సహజ సిద్ధంగా ఉన్న గుట్టలు, చెరువు కట్టను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

వితంతువులు మనోధైర్యంతో ఉండాలి



కాజీపేట రూరల్ : వితంతువులు మనోధైర్యంతో ముందుకు సాగుతూ వారి పిల్లలను సమర్థవంతులుగా తీర్చిదిద్దాలని జనవికాస ప్రెసిడెంట్ లూర్దుమర్రెడ్డి అన్నారు. కాజీపేట ఫాతిమా నగర్ బాలవికాస సెంటర్‌లో బుధవారం మూడో బ్యాచ్‌లో యువ వితంతువులకు వారి పిల్లలకు జనవికాస సంస్థ చేయూత విద్యకు అవసరమైన రూ.12 లక్షల విలువ గల బ్యాగులు, పుస్తకాలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లూర్దుమర్రెడ్డి మాట్లాడుతూ జనవికాస తరపున వేలాది మంది యువ వితంతువులకు సోఫార్ కెనడా దాతల నుంచి సహకారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా అభివృద్ధి పథక ప్రోగ్రాం మేనేజర్ లత మాట్లాడుతూ వితంతువుల పిల్లలు ఉన్నతంగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నతస్థానంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి సీనియర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుజాత, వరంగల్, దంతాలపల్లి, నాగారెక ర్నూల్, చాదర్‌ఘట్, హుజురాబాద్, మరిపెడ, జమ్మికుంట నుంచి 387 మంది వితంతువులు వారి పిల్లలు పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళి



కేయూ క్యాంపస్ : నైతిక విలువలకు కట్టుబడిన వ్యక్తి రతన్ టాటా అని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఆచార్య బి.సురేష్ లాల్ అధ్యక్షతన దివంగత రతన్ టాటా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ బాధ్యులు రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద సుధాకర్ రావు, కేయూ పాలకమండలి సభ్యులు అనితా రెడ్డి, కోశాధికారి డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



హసన్‌పర్తి : కులం పేరుతో దూషించిన యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో హసన్‌పర్తి సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించగా జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికుల పట్ల అకారణంగా దూషించిన హసన్‌పర్తికి చెందిన చెన్నూరి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా శ్రీనివాస్ ఇదే ప్రాంతానికి చెందిన జవాన్‌ను కులం పేరుతో దూషించాడని తెలిపారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, మండల కార్యదర్శి అశోక్, మున్సిపల్ యూనియర్ కార్యదర్శి బొంగు నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలే..

- గుంతల కారణంగా బస్సు సర్వీస్ నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న 3 గ్రామాల ప్రజలు
- మరమ్మతు చేపట్టాలని గ్రామస్తుల వేడుకోలు



పెద్దపెండ్యాల - క్యాతంపల్లి రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

ధర్మసాగర్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామం నుంచి క్యాతంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. కరుణాపురం జాతీయ రహదారి నుంచి క్యాతంపల్లికి 7 కిలోమీటర్లు, పెద్దపెండ్యాల నుంచి క్యాతంపల్లికి 4 కిలో మీటర్లు ఉంటుంది. వేలేరు మండలం మల్లికుదుర్ల, జానకీపురం, క్యాతంపల్లి గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. హైదరాబాద్‌కు వెళ్లే ఆయా గ్రామాల ప్రజలు కరుణాపురం చేరుకొని జాతీయ రహదారి మీదుగా వెళ్తుంటారు. అలాగే హనుమకొండ, కాజీపేట నగరాలకు కూడా ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. గతంలో జనగామ డిపో నుంచి ఆర్‌టీసీ బస్సు కరుణాపురం, పెద్దపెండ్యాల, క్యాతంపల్లి, మల్లికుదుర్ల, వేలేరు మీదుగా వేములవాడకు వెళ్తుండేది. ప్రస్తుతం గుంతల కారణంగా ఆ బస్సును నిలిపివేశారు. అలాగే క్యాతంపల్లి గ్రామానికి అమ్లెట్ విలేజ్ అయిన గుర్రాలకుంట ప్రజలు, రైతులు వివిధ పనుల కోసం క్యాతంపల్లికి, వ్యవసాయ పనుల నిమిత్తం బావుల వద్దకు ఈ రోడ్డు మీదుగా వెళ్లాలి. పెద్దపెండ్యాల చర్చి నుంచి క్యాతంపల్లి వరకు రోడ్డంతా గుంతలు ఏర్పడడంతో ఎదురుగా ఏదైనా వాహనం వచ్చినా మరో వాహనం ఆపుకొని వెళ్లాల్సిన పరిస్థితి.



క్యాతంపల్లి రోడ్డులో..

ప్రమాదకరంగా మూల మలుపు

క్యాతంపల్లి సమీపంలో మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు ఓ పక్కన కోత పడి, పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఏ మాత్రం అదుపుతప్పినా పెద్ద ప్రమాదమే జరుగుతుంది. ఈ క్రమంలో ప్రయాణికులు ఆ రోడ్డు గుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల ఆయా గ్రామాల రైతుల వ్యవసాయ భూములు ఉంటాయి. రైతులు నిత్యం ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. ఇటీవల రైతులు వ్యవసాయ పరికరాలు, ఎరువుల బస్తాలు తీసుకెళ్తూ ప్రమాదానికి గురైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయించాలని ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేయించాలి..



పెద్దపెండ్యాల, క్యాతంపల్లి గ్రామాల మధ్యలోని రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రత్యేక దృష్టి సారించి రోడ్డును మరమ్మతు చేయించాలి.

- కురుసపల్లి రాజు, క్యాతంపల్లి

ఓటరుగా నమోదు చేసుకోవాలి



దరఖాస్తులు అందజేస్తున్న భాస్కర్ రావు

శాయంపేట: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని మాందారిపేట, శాయంపేట, గంగిరేణిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బుధవారం సందర్శించి ఓటరు నమోదు ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ 2019 నుంచి 2024 అక్టోబర్ వరకు మూడు సంవత్సరాల బోధన అనుభవం గల ఉపాధ్యాయులంతా తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ బలపరుస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు చంద్రయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో అవినీతి నిర్మూలన



కేక్ కట్ చేస్తున్న అనిల్ గౌడ్

ఆత్మకూరు: సమాచార హక్కు చట్టంతో అవినీతి నిర్మూలన సాధ్యమౌతుందని సమాచార హక్కు రక్షణ చట్టం పరకాల డివిజన్ కన్వీనర్ నేరెళ్ల అనిల్‌గౌడ్ అన్నారు. మండలంలోని కటాక్షపూర్‌లో బుధవారం సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2005 అక్టోబర్ 12న చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేలేరు: మండలంలోని పీచర సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని మద్దెలగూడెం, కొండాపూర్, వావిల్లకుంట తండా, వేములపల్లి గ్రామాలకు నేడు (గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ కుమారస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరాఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- కడియం వర్గీయులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపణ

ధర్మసాగర్: కాంగ్రెస్ పార్టీలో పది సంవత్సరాలుగా కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలను కాదని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన వర్గీయులకే ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ కొత్తపల్లి భిక్షపతి ఆరోపించారు. మండలంలోని కరుణాపురం జాతీయ రహదారిపై బుధవారం ఇందిరమ్మ కమిటీలో పాత కాంగ్రెస్ శ్రేణులకు స్థానం కల్పించలేదని రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన కార్యకర్తలను విస్మరించడం సరికాదన్నారు. కల్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో కూడా తమకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం వర్గీయులకే సమాచారం ఇవ్వడంతో అసలు తాము కాంగ్రెస్ పార్టీలో ఉన్నామా లేదా అని ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాత కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాస్తారోకోలో వివిధ గ్రామాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురి చేస్తున్న పోలీసులు

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు: బీఆర్ఎస్ కార్యకర్తలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో విచారణ పూర్తికాకముందే పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఫిబ్రవరి 23న మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర సమయంలో బీఆర్ఎస్ నాయకులు జై తెలంగాణ నినాదాలు చేయగా రెండు రోజుల తర్వాత ఏసీపీ కిశోర్‌కుమార్, ఎస్ఐలు ప్రసాద్, అశోక్‌లు బీఆర్ఎస్ కార్యకర్తలను చిత్రహింసలకు గురిచేశారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే మెప్పు కోసం టాస్క్‌ఫోర్స్ ఆఫీస్‌కు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. ఆ తర్వాత ఎస్‌హెచ్ఆర్‌సీ నుంచి పోలీసులకు నోటీసులు అందాయని, విచారణ అధికారులను నియమించి, కేసు విచారణలో ఉండగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు మళ్లీ ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. పోలీసుల అక్రమ కేసులకు భయపడేదిలేదని ధర్మారెడ్డి అన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గుడుంబా పట్టివేత



పట్టుకున్న గుడుంబాను చూపుతున్న సీఐ సంతోష్, సిబ్బంది



పట్టుబడిన రేషన్ బియ్యం చూపుతున్న పోలీసులు

ఆత్మకూరు: అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను ఆత్మకూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలో బుధవారం వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఆత్మకూరుకు చెందిన పాండవుల అర్జున్ ద్విచక్రవాహనంపై పత్తిసంచిలో 17 ప్లాస్టిక్ బ్యాగుల్లో 34 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నారు. గుడుంబా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు.

రేషన్ బియ్యం..

నడికూడ: 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన బాయి కుమారస్వామి, పల్లెబోయిన అంజలి పీడీఎస్ బియ్యం డంప్ చేస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, దామెర పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించగా దాదాపు 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.41,600 వేలు ఉంటుందన్నారు. బియ్యం వ్యాపారులను అదుపులోకి తీసుకొని దామెర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ ఎల్.పవన్‌కుమార్, ఆర్ఎస్సై శరత్, టాస్క్‌ఫోర్స్, దామెర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనస్థీషియా దినోత్సవం

ఎంజీఎం : ఎంజీఎంలోని అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ మురళీ హాజరై మాట్లాడారు. విలియం టీజీ మోర్టన్ 1846లో మొదటిసారి డైథైల్ ఈథర్‌ను ఉపయోగించి దవడ సంబంధిత ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించడాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 16న ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని తెలిపారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యారణ్యపురి : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్)ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని అశోక జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణలో వేలకోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. నాయకులు పవన్‌కుమార్, అభిషేక్, ప్రదీప్‌సాయి, సందీప్‌రాజ్, కుమార్, అనూష, ప్రవళిక, అంజలి, శిరీష, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు



మీడియా అకాడమీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వరంగల్ జర్నలిస్ట్ సంఘాల నాయకులు

- దీపావళి నాటికి సానుకూల నిర్ణయం

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ బీఆర్‌కే భవన్ మీడియా అకాడమీ కార్యాలయంలో చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గతంలో సొసైటీలకు కేటాయించిన స్థలాలతో పాటు మరికొంత స్థలాన్ని సేకరించి అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సొసైటీల బాధ్యులు, యూనియన్ నాయకులు, సిక్స్‌మన్ కమిటీ సమష్టిగా అర్హులైన జర్నలిస్టుల జాబితాను రూపొందించి ఇవ్వాలని సూచించారు. అనుకున్నట్లు జరిగితే దీపావళి పండుగ నాటికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సానుకూల నిర్ణయం వెలువడగలదని, ఇందుకు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ యూనియన్‌ల నాయకులు, సొసైటీల బాధ్యులు, సిక్స్‌మన్ కమిటీ బాధ్యులు వల్లాల వెంకటరమణ, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, సీహెచ్. సుధాకర్, బిఆర్.లెనిన్, బొక్క దయాసాగర్, మస్కపురి సుధాకర్, పిన్న శివకుమార్, కె.అనిల్‌కుమార్ గౌడ్, పి.వేణుమాధవ్, బొల్లారపు సదయ్య, పివి.మదన్‌మోహన్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పుత్రికను వరించిన పీఈటీ కొలువు

- ప్రభుత్వ గురుకులాల్లో విద్య
- సోదరుడి చేయూతతో ఉపాధ్యాయ కొలువు
- ఆదర్శంగా నిలుస్తున్న మంజుల



నియామక పత్రం అందిస్తున్న మంజుల

శాయంపేట: కన్న తల్లిదండ్రులు కానరాని లోకానికి వెళ్లినా.. సోదరుడి చేయూతతో ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ బీఈడీ పూర్తి చేసిన సరస్వతి పుత్రిక ఇటీవల డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి పీఈటీ కొలువును కై వసం చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే శాయంపేట గ్రామానికి చెందిన దైనంపల్లి లక్ష్మి-ఎల్లయ్య దంపతులకు కుమారుడు బాబు, కుమార్తె మంజుల ఉన్నారు. వీరు కూలీ పని చేస్తూ పిల్లలను చదివించారు. బాబు పదో తరగతి పూర్తి కాగానే తల్లి లక్ష్మి 2012లో అనారోగ్యంతో చనిపోగా, ఐదేళ్ల తర్వాత తండ్రి ఎల్లయ్య 2017లో చనిపోయాడు. బాబు పెయింటింగ్ పని చేస్తూ చెల్లి మంజులను చదివించాడు. మంజుల 1 నుంచి 5వ తరగతి వరకు పైడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, 6 నుంచి ఇంటర్ వరకు జఫర్‌గఢ్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, బీఎస్సీ డిగ్రీ వరంగల్ వెస్ట్ సోషల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించింది. తల్లిదండ్రులు దూరమైన బాధను దిగమింగి మొక్కవోని ఆత్మవిశ్వాసంతో బీఈడీ (బీపీటీ) కాకతీయ యూనివర్సిటీలో పూర్తి చేసింది. ఇటీవల జరిగిన డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి పీఈటీగా నర్సంపేట సబ్ డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టింగ్ తీసుకొని విధుల్లో చేరింది. తల్లిదండ్రులు దూరమైనప్పటికీ సోదరుడి ఆదరణతో ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించి పీఈటీగా కొలువులో చేరడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు. మంజులను స్ఫూర్తిగా తీసుకొని యువత ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఒంటిమామిడిపల్లి పాఠశాలకు ఊరట

ఐనవోలు: ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు విద్యాశాఖ చేపట్టిన నూతన కెటాయింపులతో ఊరట లభించింది. గ్రామస్తుల, విద్యార్థుల తల్లిదండ్రుల 8 సంవత్సరాల నిరీక్షణకు తెరపడింది. 11 మంది ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. 2005లో విద్యార్థులు లేక మూతపడిన ఈ పాఠశాల.. ఓ సామాజిక కార్యకర్త స్ఫూర్తితో గ్రామస్తులందరూ ఏకతాటిపైకి వచ్చి అప్పటి ప్రజాప్రతినిధులను వేడకోగా 2016లో పునః ప్రారంభమైంది. పూర్తి స్థాయి ఇంగ్లిష్ మీడియం పాఠశాలగా 1 నుంచి 7వ తరగతి వరకు ప్రారంభం కాగా అధికారులు 8 ఎస్జీటీ, 1 లాంగ్వేజ్ పండిట్ పోస్టులను మంజూరు చేసింది. అనంతరం 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. అందుకు తగినట్టుగా అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు పలుమార్లు డీఈఓ, విద్యాశాఖ జేడీ, సంబంధిత శాఖ మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. దీంతో నూతన ఉపాధ్యాయులు 8 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, ముగ్గురు ఎస్జీటీలు విధుల్లో చేరగా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మండల వ్యాప్తంగా 24 మంది చేరిక

మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో 24 మంది ఉపాధ్యాయులు నూతనంగా విధుల్లో చేరినట్లు ఎంఈఓ పులి ఆనందం తెలిపారు. 14 మంది నూతన రిక్రూట్‌మెంట్ ఉపాధ్యాయులు కాగా మరో పది మంది గతంలో ట్రాన్స్‌ఫర్ అయి రిలీవ్ కాకుండా ఆగిన వారు ఉన్నట్లు తెలిపారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి



హసన్‌పర్తి: నిరసన తెలుపుతున్న బాధ్యులు

హసన్‌పర్తి : సనాతన ధర్మ పరిరక్షణకు హిందువులు క్షేత్ర పాలకులుగా ముందుండాలని ప్రముఖ పురోహితులు దహగం రమేశ్‌శర్మ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం నిరసన చేపట్టారు. హసన్‌పర్తి నగర హైందవ ధర్మ పరిరక్షణ ప్రముఖ్ గురుమూర్తి భద్రదేవ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ శర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయ ఆచారాన్ని కాపాడాలన్నారు. ఈకార్యక్రమంలో పురోహితులు వేదాంత సంపతాచార్యులు, గురుమూర్తి గురుదత్, కాజీపేట వెంకటస్వామి, పెద్దమ్మతల్లి ఆలయ అర్చకులు శ్రీనివాస్, శ్రీరాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, కార్పొరేటర్ శివకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచెంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, మేకల హరిశంకర్ పాల్గొన్నారు.

వినతి

వరంగల్ చౌరస్తా : ఆలయాల్లో రాజకీయ జోక్యం సరికాదని, అర్చకుల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారని చాత్తాద శ్రీవైష్ణవ సమైక్య వేదిక ద్వారా తమకు న్యాయం చేయాలని గోవిందరాజుల గుట్ట ఆలయ అర్చకులు సమైక్య వేదిక ప్రతినిధులకు బుధవారం విజ్ఞప్తి చేశారు. దేవాదాయ స్థలాన్ని కాజేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, పలుమార్లు దేవాదాయ శాఖ ఉన్నతధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని పేర్కొన్నారు. గోవిందరాజ గుట్ట ప్రధానార్చకుడు వారియోగుల శ్రీనివాస స్వామి, అర్చకులు అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తిరుపతిరెడ్డి

శాయంపేట: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వలుపదాసు చంద్రమౌళికి ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ కాగా మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి బుధవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని సాధనపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జంగ సమ్మయ్య తల్లి సాంబలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.